## పర్యావరణానికి అనుగుణంగా

# గ్రీన్ హోమ్స్

### నగరంలో సత్యవాణి హోమ్స్ నాలుగు వెంచర్లు



పి సూర్యప్రకాష్

గృహనిర్మాణ రంగం శరవేగంతో విస్తరిస్తున్న నేపథ్యంలో పర్యావరణానికి అనుగుణంగా నిర్మించే గ్రీన్ హోమ్స్ భావనకు ప్రాముఖ్యం పెరుగుతున్నది. హైదరాబాద్‌కు చెందిన సత్యవాణి హోమ్స్ భారీ ఎత్తున గ్రీన్‌హోమ్స్ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రాజెక్టు కోసం ఏకంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి కూడా సాధించింది. దీర్ఘకాలంపాటు స్ట్రక్చరల్ డిజైనింగ్, ఆర్కిటెక్చరల్ కన్సల్టెన్సీ సర్వీసుల్లో ఉన్న సత్యవాణి కన్సల్టెంట్స్ ప్రమోట్ చేసిన సత్యవాణి హోమ్స్ హైదరాబాద్‌లో మొత్తం నాలుగు చోట్ల ఏకకాలంలో గ్రీన్‌హోమ్స్ నిర్మాణం చేపట్టింది. పలు అగ్రశ్రేణి కార్పొరేట్ సంస్థలకు కన్సల్టెన్సీ సర్వీసులను అందించిన అనుభవం సత్యవాణి గ్రూప్‌నకు ఉంది. గ్రీన్ హోమ్స్ కాన్సెప్ట్ గురించి, సత్యవాణి లక్ష్యాల గురించి సంస్థ ఎండి పి సూర్య ప్రకాష్‌తో ఆంధ్రజ్యోతి బిజినెస్‌బ్యూరో ఇష్టాగోష్ఠి.

**గ్రీన్‌హోమ్స్ ప్రత్యేకత...**

దేశీయంగా గృహనిర్మాణ సంఖ్య భారీగా పెరుగుతున్నది. భారీ స్థాయి నిర్మాణాల్లో గ్రీన్ కాన్సెప్ట్ ఇప్పటికే ప్రచారంలోకి వచ్చింది. సిఐఐ హైదరాబాద్‌లో గ్రీన్ బిజినెస్ సెంటర్‌ను ప్రత్యేకంగా నిర్మించింది. ఒక రకంగా ఇదే నాకు స్ఫూర్తి. భారీ ఎత్తున సాగుతున్న గృహనిర్మాణాల్లోకి కూడా ఈ భావనను ప్రవేశపెడితే పర్యావరణానికి మేలు జరుగుతుందనే ఉద్దేశంతో మేం ఈ ప్రాజెక్టులను చేపట్టాం. వెయ్యి అడుగుల చదరపు అడుగుల వైశాల్యంతో నిర్మించే సాధారణ గృహాల నుంచి ఏటా వెలువడే కార్బన్ ఎమిషన్ 600 మెట్రిక్ టన్నులు ఉంటుందని అంచనా. భారత్ వంటి వర్ధమాన దేశాల్లో గృహనిర్మాణాలు పెరుగుతున్న నేపథ్యంలో పర్యావరణ అనుకూల నిర్మాణాలు మేలు చేస్తాయి.

**గ్రీన్‌హోమ్స్‌లో ఎటువంటి మెటీరియల్ ఉపయోగిస్తారు?**

డిజైనింగ్ స్థాయి నుంచే ఈ నిర్మాణాల్లో వైవిధ్యం ఉంటుంది. ప్రధానంగా రీసైకిల్ చేసిన, తిరిగి ఉపయోగించుకునే వెసులుబాటు ఉన్న మెటీరియల్‌ను ఎక్కువగా ఈ నిర్మాణాల్లో ఉపయోగిస్తాం. సహజమైన గాలి, వెలుతురు ధారాళంగా ఉండేలా చూస్తాం. గ్రీనరీకి ప్రాధాన్యత ఉంటుంది. ఇవన్నీ గేటెడ్ కమ్యూనిటీస్. వీటిలో కమ్యూనిటీ వాషింగ్ సెంటర్స్ ఉంటాయి. డ్రైనేజ్ వాటర్‌ను శుద్ధి చేసి మొక్కల పెంపకానికి ఉపయోగించే ఏర్పాట్లు చేస్తాం. అదే విధంగా విద్యుత్ కూడా గ్రీన్ విద్యుత్ అంటే విండ్ పవర్, సోలార్ పవర్‌నే ప్రధానంగా మా వెంచర్స్‌లో వినియోగిస్తాం. పైగా ఈ ప్రాజెక్టుల ఆధారంగా కార్బన్ క్రెడిట్స్ ట్రేడింగ్‌లోకి ప్రవేశించే యోచన కూడా ఉంది.

**గ్రీన్‌హోమ్స్ వెంచర్ల వివరాలు... ఫండింగ్ ఎలా చేస్తున్నారు?**

కొండాపూర్‌లో ఎకరం స్థలంలో, బేగంపేటలో అరఎకరం స్థలంలో, గాగిల్లాపూర్‌లో 20 ఎకరాల్లో, అన్నోజిగూడలో మరో 12 ఎకరాల్లో గ్రీన్‌హోమ్ వెంచర్స్ చేపట్టాం. 30 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని డెవలప్ చేయాలన్నది మా లక్ష్యం. బహుళ అంతస్తుల సౌధాలు, ఇండిపెండెంట్ విల్లాలు కూడా మా ప్రాజెక్టుల్లో ఉన్నాయి. తొలి విడత 150 కోట్ల రూపాయలను ఇన్వెస్ట్ చేస్తున్నాం. అందులో 70 కోట్ల రూపాయల మేర బ్యాంక్ ఫైనాన్స్ మరో 25 కోట్ల రూపాయలు ఈక్విటీ కింద సమీకరిస్తున్నాం. 40 కోట్ల రూపాయల మేర అమెరికా సంస్థ అమిటాయిస్ ఇన్వెస్ట్‌మెంట్ పెట్టుబడిగా పెడుతున్నది. మిగతా మొత్తం అంతర్గత వనరుల నుంచి సమకూరుస్తాం. హౌజింగ్ ప్రాజెక్టుల్లో ఎఫ్‌డిఐ ఇదే మొదటి సారి.

**గ్రీన్‌హోమ్స్‌కు ఆదరణ ఎలా ఉంది.**

విద్యావంతులు, ఉన్నతాదాయ వర్గంలో ఉన్న ప్రొఫెషనల్స్‌నుంచి మంచి ఆదరణ కనిపిస్తున్నది. మొన్నటి బడ్జెట్‌లో ప్రభుత్వం రాయితీలు కల్పిస్తే బాగుండేది. రాయితీల వల్ల ఖజానాకు వచ్చే నష్టం కంటే అంతర్జాతీయంగా భారత్‌కు లభించే ప్రతిష్ఠ చాలా ఎక్కువ.

పైగా భవిష్యత్‌లో కార్బన్ క్రెడిట్స్‌లో ట్రేడింగ్‌కు కూడా అవకాశం ఉంటుంది.